
సాక్షి ఒడిశా

శనివారం । 15 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,81,744
బంగారం	25 గ్రాముల 300 మిల్లీ గ్రాములు
వెండి	42 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



రాష్ట్రంలో రెండో కోవిడ్ మృతి

- 8లో

దార్శనికుడు అంబేడ్కర్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. అంబేడ్కర్ దార్శనికుడని కొనియాడారు. న్యాయవాదిగా, ఆర్థిక, రాజకీయవేత్తగా, సంఘ సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా ప్రజల గుండెల్లో సుస్థిరంగా నిలిచిన ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు.

- సాక్షి నెట్‌వర్క్

- 8లో

న్యూస్‌రీల్

నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న నళిని

రాయగడ: స్థానిక రైతుల కాలనీలో ఉన్న నవజీవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులను ట్రస్ట్ నిర్వాహకులు శనివారం పంపిణీ చేశారు. ఆదివాసీ వృద్ధ మహిళలైన 35 మందికి బియ్యం, కందిపప్పు, వంట నూనే, ఉల్లిపాయలు తదితర నిత్యావసరాలను ప్రతీ నెలా తమ ట్రస్ట్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకురాలు నళిని తెలియజేశారు.

కింగ్ కోబ్రా కలకలం



పట్టుబడిన కింగ్ కోబ్రా

బరంపురం: జిల్లాలోని దిగపండి దగ్గర పెందురబడి గ్రామంలో 12 అడుగుల కింగ్ కోబ్రా శుక్రవారం కలకలం సృష్టించింది. స్థానికుల సమాచారంతో దిగపండి అటవీ రేంజ్ అధికార బృందం సహకారంతో స్నేక్ హెల్ప్‌లైన్ సంస్థకి చెందిన ఆశిరాజ్ కింగ్ కోబ్రాని పట్టుకున్నారు. అనంతరం దిగపండి అటవీ విభాగం దగ్గరలో ఉన్న చందుడివేప్ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎలుగు దాడిలో వృద్ధుడికి గాయాలు



చికిత్స పొందుతున్న రామమాఝి


మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి దయిగూఢ గ్రామ సమీపంలోని అడవిలో ఒక వృద్ధుడిపై ఎలుగు దాడిచేసి గాయపరిచింది. వివరాల్లోకి వెళ్తే... దయిగూఢ గ్రామానికి చెందిన రామమాఝి(66) తన భార్య కమల మాఝితో కలిసి అడవిలో బీడీ ఆకుల కోసం శుక్రవారం ఉదయం వెళ్లాడు. ఆకులు తీస్తున్న సమయంలో ఒక ఎలుగుబంటి వారిపై దాడిచేసింది. దీంతో వారు కేకలు వేయడంతో చుట్టూ ఉన్నవారు వచ్చి రక్షించారు. అయితే అప్పటికే రామ తోడ భాగంలో ఎలుగు గాయపరిచింది. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విషయం తెలుసుకున్న బీడీ ఆకుల రేంజర్ ప్రశాంత్ కుమార్ పండ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రామమాఝిని పరిశీలించారు. ప్రభుత్వ నుంచి సాయం అందజేస్తామని తెలియజేశారు.

బీజేడీలోకి చేరికలు



బీజేడీలో చేరిన నాయకులతో సుధీర్ దాస్

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయి పంచాయతీకి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీజేడీలో శుక్రవారం చేరారు. వీరంతా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్ సమక్షంలో పార్టీ కండువ కప్పుకున్నారు. బీజేడీలో చేరినవారిలో మాజీ సర్పంచ్ లింగరాజ్ పాలక, ఎం.ధర్మేంద్ర, భీమసేన్ బాగ్, ఎల్.మృత్యుంజయరావు, నృసింహ స్వాయి, నేపాల్, సరాబు సరక తదితరులు ఉన్నారు.



భువనేశ్వర్: వసుంధర రెక్కిలో పోసిన పానక ద్రవ్యాలు

కొంగొత్త ఆశలతో...!

ఒడియా ప్రజలు నూతన సంవత్సరంగా జరుపుకునే పొనా సంక్రాంతి సంబరాలు రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. నాయకులు, అధికారులు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని వేకువజాము నుంచే ఆలయాల్లో పూజలు నిర్వహించారు. పలుచోట్ల స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రజలకు పొనా పంపిణీ చేశారు. ఆలయాల వద్ద పంచాగ శ్రవణం జరిపించారు. ఈ ఏడాది రాష్ట్రంలో మిశ్రమ ఫలితాలు ఉండనున్నాయని కొత్త పంచాంగం పేర్కొంది. వాయిదా పడిన అనేక ప్రాజెక్టులు అమలు కానున్నాయి. రానున్న ఎన్నికల్లో అధికార పార్టీయే అధికారంలోకి వస్తుందని కొత్త పంచాంగ గణాంకాలు సూచిస్తున్నట్లు పంచాంగ విశ్లేషకులు తెలిపారు. అల్పపీడనం, తుఫానులు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల చాలా నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్: శ్రీమందిరం సింహ ద్వారం వద్ద పొనా సంక్రాంతి పుష్ప సోయగం

ఘనంగా ఒడియా నూతన సంవత్సరం వేడుకలు



భువనేశ్వర్: శ్రీమందిరం తోరణ లక్ష్మి నూతన సంవత్సర శోభ



రాయగడ: అమ్మవారి పూజకు కలశాలు తీసుకెళ్తున్న మహిళలు



బరంపురం: గిరి మార్కెట్ రోడ్డులో పొనా పంచుతున్న దృశ్యం



భువనేశ్వర్: పుష్పాలంకరణలో శ్రీమందిరం



రాయగడ: పొనా పంపిణీ చేస్తున్న యువతులు



రాయగడ: తేజస్వినీ గ్రౌండ్‌లో పంచాంగ పఠనం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ఇంటి వాకిట్లో తులసి మొక్కకు వసుంధర రెక్కిఅమరిక





జయపురం: దైనిక బజారులో పూజలు చేస్తున్న మహిళలు

కార్మిక శాఖ మంత్రి రాజీనామా చేయాలి


- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ లేఖశ్రీ



మాట్లాడుతున్న లేఖశ్రీ సామంత సింఘార్

భువనేశ్వర్: బిజూ జనతా దళ్ కార్యకర్తపై లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి శ్రీకాంత్ సాహు రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ లేఖశ్రీ సామంత్ సింగార్ డిమాండ్ చేశారు. స్థానిక బీజేపీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. మంత్రిపై ఫిర్యాదు చేయడానికి లైంగిక వేధింపుల బాధిత మహిళ గురువారం ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు భువనేశ్వర్ మహిళా పోలీసు ఠాణాలో వేచి ఉండాల్సి వచ్చిందన్నారు. చివరకు పోలీసులు కేసు నమోదు చేసి ఆమెను వైద్య పరీక్షల నిమిత్తం పంపించినట్లు పేర్కొన్నారు. మంత్రిపై ఫిర్యాదు దాఖలైనందున, నైతిక కారణాలతో ఆయన రాజీనామా చేయాలన్నారు. లేకుంటే తన అధికారాన్ని దుర్వినియోగం చేసి కేసును అణిచివేసేందుకు పోలీసులపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై నిష్పక్షపాత ఏజెన్సీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీఎం నవీన్ పట్నాయక్ మహిళల గౌరవంపై భారీ ప్రసంగాలు చేస్తుండగా, ఆయన మంత్రివర్గంలోని కొంతమంది అకృత్యాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఉపాధ్యాయుని మమితా మెహర్ హత్య, మహంగా ట్రిపుల్ మర్డర్, తిర్తోల్ సెక్స్ రాకెట్ కేసులు ఈ కోవకు చెందినవి ఆమె ఉదహరించారు. మమితా మెహర్ హత్యలో మంత్రి కెప్టెన్ దివ్య శంకర్ మిశ్రా, మహంగా ట్రిపుల్ మర్డర్‌లో మంత్రి ప్రతాప్ జెనా, తిర్తోల్ సెక్స్ రాకెట్ కేసుల్లో స్థానిక ఎమ్మెల్యే బిజయ్ శంకర్ దాస్ ప్రమేయం బట్టబయలైనా, పోలీసులు వారిని ప్రశ్నించలేదని మండిపడ్డారు. బాధిత మహిళను బెదిరించి కేసును ఉపసంహరించుకునేలా చేసేందుకు పాలక నాయకులు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. బీజేడీ పాలనలో రాష్ట్రంలోని మహిళలు సురక్షితంగా లేరని ఆవేదన వ్యక్తం చేశారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



ఒడియా నూతన సంవత్సరం, మహా భిషు సంక్రాంతిని పురస్కరించుకొని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌లు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఒడియా నూతన సంవత్సరం సందర్భంగా నా ప్రియమైన సోదరులు, సోదరీమణులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ట్వీట్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన ట్విట్టర్ హ్యాండిల్‌లో మహా భిషు పొణా సంక్రాంతి, ఒడియా నూతన సంవత్సర శుభాకాంక్షలు. కొత్త సంవత్సరం ఆనందం, మంచి ఆరోగ్యాన్ని సమృద్ధిగా తీసుకురావాలి. రాబోయే సంవత్సరంలో మీ కోరికలన్నీ నెరవేరాలని కోరుకుంటున్నాను అని సందేశం తెలిపారు. దేశంలో ఒడిశాను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రజలంతా కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు అందజేశారు. మహాప్రభు జగన్నాథుని అపారమైన దయతో, ఈ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికీ సరికొత్త అవకాశాలను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆకాంక్షించారు.

- భువనేశ్వర్

భారీగా గంజాయి పట్టివేత



బరంపురం: 150 కిలోల గంజాయితో పట్టుబడిన నిందితుడిని చూపిస్తున్న పోలీసులు



జయపురం: గంజాయి బస్తాలు, తుపాకులతో పట్టుబడిన దాశ ఖొర

బరంపురం: గంజాం పోలీసుస్టేషన్ పరిధి 16వ నంబర్ జాతీయ రహదారిపై బరంపురం వైపు కారులో అక్రమంగా తరలిస్తున్న 175 కిలోల గంజాయిని ఎక్సైజ్ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మినా తెలిపిన వివరాలు మేరకు.. కళ్లికోట్ దగ్గర 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి బరంపురం వైపు కారులో గంజాయి తరలిస్తున్నట్లు ముందుగా సమాచారం వచ్చింది. దీంతో ఎక్సైజ్ అధికారులు రెక్కి నిర్వహించి, జిల్లాలోని ధను జైయ్‌పూర్ దగ్గర కారులో తనిఖీలు నిర్వహించారు. 11 బస్తాల్లో 150 కిలోల గంజాయితో పాటు కారుని సీజ్ చేసి ఒకరిని అరెస్టు చేశారు. అలాగే గజపతి జిల్లా మోహనా అటవీ ప్రాంతం నుంచి బరంపురం తరలిస్తున్న 25 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఐఐసీ అధికారి కౌసిక్ మజ్జి తెలియజేశారు. దీంతో వాహనం సీజ్ చేసి, డ్రైవర్‌ని అరెస్టు చేశారు.



బరంపురం: 25 కిలోల గంజాయితో పట్టుబడిన నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

జయపురం: బొయిపరిగుడ సమితి ప్రాంతాల్లో పోలీసులు రెండుచోట్ల జరిపిన దాడిలో 589 కేజీల గంజాయి పట్టుబడింది. బొయిపరిగుడ పోలీసు అధికారి అశ్వినీ పట్నాయిక్ తెలిపిన వివరాల మేరకు.. బొయిపరిగుడ నుంచి పలు ప్రాంతాలకు తరలించేందుకు గంజాయి సిద్ధంగా ఉంచిన ఇంటిపై పోలీసులు దాడి చేశారు. పోలీసులు జరిపిన దాడిలో ఆ ఇంటిలో గంజాయితో పాటు రెండు నాటు తుపాకులు పట్టుబడ్డాయి. దీంతో నిందితుడిని అరెస్టు చేశారు. అరెస్టు చేయబడిన వ్యక్తి బొయిపరిగుడ పోలీసుస్టేషన్ పరిధి పాడెయ్‌ఖొదర్ గ్రామానికి చెందిన దాశ ఖొర అని తెలియజేశారు. అతనిని విచారించగా ఇంటిలో గంజాయి దాచిన నిందితుడు పరారైనట్లు వెల్లడించారు. పట్టుబడిన గంజాయి 132 కేజీలు ఉందని వెల్లడించారు. దాడిలో సబ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణచంద్ర సెఠీ, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ మోడీ సింగ్, సుబ్రత పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కాశపడ పంచాయతీ జబనువాగుడ గ్రామంలో 457 కేజీల గంజాయి పట్టుకున్నట్లు పోలీసు అధికారి పట్నాయిక్ వెల్లడించారు. అయితే గంజాయి రవాణా చేస్తున్న నలుగురు మాఫియా వ్యక్తులు పారిపోయారని వెల్లడించారు.



జయపురం: జబనువాగుడ గ్రామంలో పట్టుబడిన 457 కేజీల గంజాయి

అడవి పంది దాడిలో యువకుడికి గాయాలు



మల్కన్‌గిరి: అడవి పంది దాడిలో యువకుడు గాయపడిన ఘటన బలిమెల పోలీసుస్టేషన్ పరిధి నీలాంద్రీనగర్ పంచాయతీలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... నీలాంద్రీనగర్ పంచాయతీ పరజాగూఢ గ్రామానికి చెందిన నరసింహ కధమ్(18) కర్రల కోసం సమీపంలోని అడవికి ఉదయం వెళ్లాడు. అడవిలో కర్రలు కొడుతున్న సమయంలో ఒక అడవి పంది వెనుక నుంచి వచ్చి అతనిపై దాడి చేసింది. కాలు, చాతిపై గాయపరిచి అడవిలోకి వెళ్లిపోయింది. వెంటనే అతడు తన వద్దనున్న మొబైల్‌తో ఇంటికి ఫోన్‌చేసి విషయం తెలియజేశాడు. కుటుంబ సభ్యులు వచ్చి అతడిని బలిమెలా ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. అయితే చాతిపై గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం మల్కన్‌గిరి తరలించారు.

రత్నాల కిశోర్ చౌదరి రాజీనామా



కిశోర్

జయపురం: స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పదవికి రత్నాల కిశోర్ చౌదరి శుక్రవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాంబర్ ఎన్నికలపై పలు ఆరోపణలు చేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్‌లో కొంతమంది ఎంతో కాలంగా పదవుల్లో ఉంటున్నారన్నారు. వారు కొత్త డైరెక్టర్లకు అవకాశం ఇవ్వడానికి ఇష్టపడడం లేదని పేర్కొన్నారు. అందువలన డైరెక్టర్‌గా కొనసాగడానికి మనస్సు అంగీకరించక రాజీనామా చేసినట్లు వెల్లడించారు. తన రాజీనామాను అధ్యక్షునికి అందజేశానని తెలియజేశారు. కిశోర్ చాంబర్ అధ్యక్ష పదవికి పోటీచేసి ఓటమి చెందిన విషయం తెలిసిందే. చాంబర్ బైలా ప్రకారం సభ్యులు 21 మంది డైరెక్టర్లను సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఎన్నుకోగా, ఎన్నికైన డైరెక్టర్లు అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. అధ్యక్షులు తన కార్యవర్గాన్ని నియమించుకుంటారు. అందువలన డైరెక్ట్ ఎన్నికలో కిశోర్‌కు అందరికన్నా ఎక్కువ ఓట్లు వచ్చి టాపర్‌గా నిలిచినా, అధ్యక్ష పదవికి పోటీచేసి ఓటమి చెందారు. గత ఎన్నికలోనూ ఆయన అందరికన్నా అత్యధిక ఓట్లు పొందినా ఏ పదవీ దక్కలేదు. కిశోర్ రాజీనామాపై అధ్యక్షుడు ప్రభాకర్ స్పందిస్తూ చాంబర్ కోసం పనిచేసే వారినే తాము కార్యవర్గంలో చేర్చుకున్నామని వెల్లడించారు. గత ఎన్నికలో డైరెక్టర్‌గా ఎన్నికైన కిశోర్ ఎటువంటి సమయం కేటాయించలేకపోయారని అందుచేత కార్యవర్గంలోనికి తీసుకోలేకపోయామని వెల్లడించారు.

క్లుప్తంగా

వడదెబ్బతో ఆర్టీసీ కలాసీ మృతి

కొత్తవలస: మండల కేంద్రంలో ఆర్టీసీ కలాసీగా పనిచేస్తున్న పొన్నకాయల రాము(56) శుక్రవారం వడదెబ్బ ధాటికి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కలాసీ రాము స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పనిచేస్తుండగా ఉదయం 11.30 గంటల ప్రాంతంలో కొత్తవలస జంక్షన్‌లో గల టీ దుకాణంలో టీ తాగేందుకు వచ్చి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వడదెబ్బకు గురై మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. మృతుడికి భార్య ఒక కొడుకు రాము ఉన్నారు.

రెండు లారీలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

గజపతినగరం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి వద్ద ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొనడంతో ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. శుక్రవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. మధుపాడ గ్రామం నుంచి గజపతినగరం వస్తున్న ఒక లారీ విశాఖపట్నం నుంచి గజపతినగరం మీదుగా వస్తున్న మరో లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఓ లారీ డ్రైవర్, క్లీనర్‌లు కురుచరణ్ సింగ్, సాలేస్‌లకు తీవ్ర గాయాలు కావడంతో గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. మరో లారీ డ్రైవర్, క్లీనర్‌లకు పాక్షికంగా గాయాలయ్యాయి.

అమరవీరులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యం


మౌనం పాటిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది

విజయనగరం క్రైమ్: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని జిల్లా అగ్నిమాపక అధికారి కె.వినయ్ అన్నారు. శుక్రవారం స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జిల్లాకు వచ్చిన ఏపీ ఫైర్ సర్వీసెస్ డీజీ పీవీ సునీల్‌కుమార్‌ను కలిసి వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఏడీఎఫ్ఓ సోమేష్ పాల్గొన్నారు.

విశాఖలో స్వధార్ బాలికల గుర్తింపు

విజయనగరం ఫోర్ట్: జిల్లాకేంద్రంలోని మహిళా ప్రాంగణంలో ఉన్న స్వధార్ హోమ్ నుంచి పరారైన ఇద్దరు అమ్మాయిలు విశాఖలో ప్రత్యక్షమయ్యారు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో కిటికీలు వంచి ఇద్దరు అమ్మాయిలు పరారైన సంగతి విదితమే. స్వధార్ సూపరింటెండెంట్ కమల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదుచేసిన విచారణ చేపట్టారు. వారిద్దరినీ విశాఖలో ఓ హోటల్ సమీపంలో గుర్తించి, జిల్లాకేంద్రానికి తీసుకువచ్చారు. దిశ పోలీస్ స్టేషన్ ఆవరణలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుల సమక్షంలో తల్లిదండ్రులకు వారిని అప్పగించనున్నారు.

అగ్నిమాపక సిబ్బంది సేవలు ఎనలేనివి

పార్వతీపురంటౌన్: అగ్నిమాపక సిబ్బంది సేవలు ఎనలేనివని ఆర్డీఓ కె. హేమలత ప్రశంసించారు. ఈ మేరకు స్థానిక అగ్నిమాపక కేంద్రంలో జాతీయ అగ్నిమాపక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విధుల్లో ఉండగా ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను ఆమెతో పాటు పార్వతీపురం అగ్నిమాపక అధికారి యు. సుధాకరరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ విపత్తులు ఎదురైనప్పుడు అగ్నిమాపక సిబ్బంది వారి ప్రాణాలు పణంగా పెట్టి, ప్రజల ప్రాణ, ఆస్తులను కాపాడుతున్నారన్నారు. వారి సేవలను ఆమె కొనియాడారు. ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించనున్నట్లు, ఈ వారోత్సవాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్‌టి.ఉమా మహేశ్వరరావు, అధికారి రమేష్, ఫైర్ సిబ్బంది బి. ప్రసాదరావు, ఎల్.మోహన్ కుమార్, టి.త్రినాథరావు, తవిటినాయుడు, ఫైర్ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కోవిడ్ పరీక్షలు పెంచాలి

పార్వతీపురం: జిల్లాల్లో కోవిడ్ పరీక్షలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రోజుకు కనీసం ప్రతి జిల్లాలో 200 మందికి కోవిడ్ పరీక్షలు చేయాలని సూచించారు. మాస్కులు ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, ఉపాధిహామీ ప్రదేశాల్లో తాగునీటి వసతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఒ.ఆనంద్, పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఈఓ ఎస్‌డీవీ రమణ, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, వైద్యాధికారులు జగన్నాథరావు, టి.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

దార్శనికుడు అంబేడ్కర్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. అంబేడ్కర్ దార్శనికుడని కొనియాడారు. న్యాయవాదిగా, ఆర్థిక, రాజకీయవేత్తగా, సంఘ సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా ప్రజల గుండెల్లో సుస్థిరంగా నిలిచిన ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్


భువనేశ్వర్: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్


మల్కన్‌గిరి: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్ అక్షయ్ కుమార్ ఖేముండు తదితరులు


రాయగడ: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సరక, నెక్కంటి, కలెక్టర్ సింగ్ తదితరులు


పర్లాకిమిడి: సీపీఎం కార్యాలయంలో మాట్లాడుతున్న దండపాణి రైయితో తదితరులు


పర్లాకిమిడి: కొత్త బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి అంజలి ఘటిస్తున్న కలెక్టర్ లింగరాజ్ పండా


భువనేశ్వర్: శ్రామిక్ కాంగ్రెసు ప్రధాన శాఖ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


జయపురం: అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


జయపురం: అంబేడ్కర్ జయంతి సందర్భంగా రక్తదానం చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు


జయపురం: కాంగ్రెస్ భవన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న ఎంపీ ఉల్క తదితరులు


జయపురం: జగన్నాథ్ సాగరం ఒడ్డున అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ కార్యకర్తలు


బరంపురం: అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో సర్దార్ వల్లభాయ్ సమాజ్ ప్రతినిధులు


జయపురం: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ముగిసిన దొండనచో దీక్షలు

చైత్రమాసం సందర్భంగా గత నెల రోజులుగా జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో చేపట్టిన దొండనచో దీక్షలు శుక్రవారంతో ముగిశాయి. దీనిలో భాగంగా నెల రోజుల పాటు ఒక గదిలో ఉండి కఠిన దీక్ష చేపట్టిన గురువు అగ్ని గుండంపై తలక్రిందులుగా వేలాడారు. అనంతరం అతని ముక్కు నుంచి రెండు చుక్కల రక్తం అగ్నిగుండంపై పడిన వెంటనే సాంప్రదాయబద్ధంగా అగ్నికీలలతో ప్రదర్శనలు చేశారు. తదుపరి దీక్షదారులు చెరువులో సాయంత్రం స్నానం చేసి ప్రసాదం సేవించారు. రాత్రి సమయంలో చేపట్టిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

– బరంపురం


కొండాసింగ్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం


పంచాదోవుల వీధిలో అగ్ని గుండంపై తలక్రిందులుగా గురువు వేలాడుతున్న దృశ్యం


ప్రదర్శనలు చేస్తున్న దీక్షదారులు


అగ్నికీలల ప్రదర్శనలో దొండొకాళీ అమ్మవారి రూపం


గాంధీనగర్‌లో ఎండలో దొండనచో దీక్షలు చేస్తున్న దీక్షదారులు

రాష్ట్రంలో రెండో కోవిడ్ మృతి

భువనేశ్వర్: రాష్ట్రంలో కోవిడ్ తీవ్రత క్రమంగా పంజా విసురుతోంది. ఒక వైపు పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతుండగా, మరోవైపు మృత్యు సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఈ పరిస్థితులు సాధారణ ప్రజానీకాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. రాష్ట్రంలో తాజాగా కోవిడ్ మృతి నమోదైనట్లు రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ శుక్రవారం ప్రకటించింది. మృతురాలు ఝార్సుగుడ జిల్లాకు చెందిన 65 ఏళ్ల మహిళగా గుర్తించారు. ఆమె తీవ్రమైన కిడ్నీ ఇన్ఫెక్షన్, దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి, పల్మనరీ ఎడెమాతో గత కొద్దికాలంగా బాధపడుతోంది. దీంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచింది.



258 కేసులు నమోదు

రాష్ట్రంలో శుక్రవారం 258 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. దీంతో టెస్ట్ పాజిటివిటీ రేటు 4.1 శాతానికి చేరింది. కటక్ ఎస్‌సీబీ కోవిడ్ ఆస్పత్రిలో కోవిడ్ చికిత్స పొందుతూ 80 ఏళ్ల వృద్ధుడు మృతి చెందినట్లు ప్రసారమైన వార్తలను అధికారులు ఖండించారు. కేవలం ఝార్సుగుడలో మాత్రమే ఒకరు మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈనెల ప్రారంభంలో సుందర్‌గడ్ జిల్లాకు చెందిన 50 ఏళ్ల వ్యక్తి కోవిడ్‌తో చికిత్స పొందుతూ మరణించాడు. గత ఐదు నెలల్లో రాష్ట్రంలో ఇది మొదటి కోవిడ్ మరణం కాగా, శుక్రవారం నాటి మృతి రెండో మరణంగా నివేదించబడింది. 2022 సంవత్సరం నవంబర్ 6న చివరి కోవిడ్ మరణం నమోదైంది. ఈనెల 5 నుంచి 11వ తేదీల మధ్య వారం రోజుల వ్యవధిలో సోన్‌పూర్ జిల్లాలో రాష్ట్రంలో అత్యధిక వీక్లీ పాజిటివిటీ రేటు 10.8 శాతంగా నమోదయ్యింది. రాష్ట్రంలో ప్రస్తుతం 1,186 కోవిడ్ యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇటీవల చిన్నారుల్లో కోవిడ్ సంక్రమణ ఛాయలు తరచూ తారస పడుతున్నట్లు అధికార వర్గాల సమాచారం.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

రాయగడ: భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అన్ని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. స్థానిక జగన్నాథ మందిరం నుంచి జై శ్రీరామ్ నామస్మరణతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త శ్రీచైతన్య రాంజీ, భజరంగ దళ్‌కు చెందిన జోగేశ్వరదాస్, మంజుల మినియాక, బసంత కుమార్ ఉలక తదితరులు పాల్గొన్నారు.

బరంపురం: నగరంలోని వివిధ కూడళ్లలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో వేకువజాము నుంచే భక్తులు పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా, హనుమాన్ దండకం చదివారు. పూజలతో నగరంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

పర్లాకిమిడి: పట్టణంలోని గుండిచాబడి మందిరం వద్ద హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. అలాగే పర్లాకిమిడి రైల్వేస్టేషన్ సమీపంలో, బెత్తగుడ వద్ద వేడుకలు చేపట్టారు.

జయపురం: స్థానిక దైనిక బజారులో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు దీపారాధన నిర్వహించారు. అలాగే 26వ జాతీయ రహదారి డెప్పిగ ప్రాంతంలోని హనుమాన్ మందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. పూజల్లో ఎంపీ సప్తగిరి ఉల్క పాల్గొన్నారు.


బరంపురం: రామలింగేశ్వర్ రోడ్‌లో పూజలందుకుంటున్న హనుమంతుడు


జయపురం: గీతా మందిరం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎంపీ ఉల్క


పర్లాకిమిడి: తులసిపాడు వద్ద పూజలందుకుంటున్న హనుమయ్య


రాయగడ: ర్యాలీ నిర్వహిస్తున్న భజరంగదళ్ కార్యకర్తలు

వంగరలో సినీనటుడు శ్రీకాంత్

- షిర్డీసాయి బాబాను దర్శించి పూజలు


షిర్డీ సాయినాథుని దర్శించుకుంటున్న సినీ హీరో శ్రీకాంత్


అభిమానులకు అభివాదం చేస్తున్న హీరో శ్రీకాంత్

వంగర: సినీ నటుడు శ్రీకాంత్‌తోపాటు పలువురు సినీ ఆర్టిస్టులు శుక్రవారం మండల కేంద్రం వంగరలో సందడి చేశారు. బొత్స వెంకటనాయుడు, లక్ష్మీ సింహాచలం దంపతులు నిర్మించిన శ్రీషిర్డీసాయిబాబా ఆలయ ప్రథమ వార్షికోత్సవానికి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీనటుడు శ్రీకాంత్ మాట్లాడుతూ దేవుడిపై నమ్మకం మనలో ఒక సార్థకతను.. మానవత్వాన్ని పెంచుతోందన్నారు. సినిమా షూటింగ్ వాయిదా పడడంతో ఈ ప్రాంతానికి రాగలిగానని, పల్లె వాతావరణం చాలా బాగుందని, మడ్డువలస రిజర్వాయర్ చూసిన తరువాత ఆనందం కలిగించిందని అన్నారు. సినీ ఆర్టిస్టులు చిట్టిబాబు, శ్రీలక్ష్మి, రామ్‌జగన్, రాగిణి, సునామీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

25న జీఎంఆర్ నైరెడ్‌లో స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఈ నెల 25న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ కె.శశిధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుగల నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. స్త్రీ, పురుషులకు వేరువేరుగా శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. పురుషులకు కంప్యూటర్ బేసిక్స్ అండ్ టాలీ, కార్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ రిపేర్, సర్వీసింగ్‌లో నెలరోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. స్త్రీలకు హోమ్ నర్సింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, లేడీస్ టైలరింగ్‌లలో 30 రోజులు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డులతో తీసుకురావాలని సూచించారు. శిక్షణ మే 1 నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయం కల్పించనున్నామని వివరించారు.

క్లుప్తంగా

జిల్లా సీనియర్స్ మెన్ హాకీ ఎంపికలు రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ పురుషుల హాకీ జట్టు ఎంపికలు ఈ నెల 16న జరగనున్నాయి. శ్రీకాకుళం రూరల్ మండలంలోని పాత్రునివలస క్రీడా మైదానం వేదికగా ఆదివారం ఉదయం 6.30 నుంచి ఈ ఎంపికల ప్రక్రియ ప్రారంభంకానుంది. అదే రోజు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 5-ఏ సైడ్ హాకీ టోర్నమెంట్ పోటీలు కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, 3 పాస్‌ఫొటోలతో హాజరుకావాలని జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఉమా మహేశ్వరరావు, కార్యదర్శి ఎస్.మధు కోరారు. పూర్తి వివరాలకు 76608 77497 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆశ్రమ విద్యార్థిని ఆదుకోవాలి



విద్యార్థి గోపిని పరామర్శిస్తున్న ఆదివాసి వికాస పరిషత్ నాయకులు

మందస: మండలంలోని కిల్లోయి ఆశ్రమంలో చదువుతున్న విద్యార్థి టి.గోపిని ఆదుకోవాలని ఆదివాసీ వికాస పరిషత్ నాయకులు కోరారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని శుక్రవారం పరామర్శించి, సంఘటన పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మందసలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్, కుక్ నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థి చేయి కాలిపోయి ఇన్‌ఫెక్షన్‌కు గురైందన్నారు. తండ్రి లేకపోవడంతో తల్లి సీత కష్టపడుతూ కుమారుడిని చదివిస్తోందన్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి, గోపి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సవర జగన్, జేఏసీ అధ్యక్షుడు సవర రాంబాబు, రామారావు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం



రక్తదాతలతో సేవా సమితి సభ్యులు

వజ్రపుకొత్తూరు: యువతరం సేవా సమితి సహకారంతో ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో పూండిలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 20 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తం దానం చేశారు. వీరిలో పలాసకు చెందిన మహేంద్ర హోమ్ ఫైనాన్స్ శాఖ ఉద్యోగులు 8 మంది ఉన్నారు. దాతలకు ప్రశంస పత్రాలను అందించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు చింత మురళి, సభ్యులు కె.రాంబాబు, జి.అశోక్, లింగరాజు, నూకరాజు, నారాయణ, బాలరాజు, ఉమాపతి, శిరీష, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వాలదే

శ్రీకాకుళం: ప్రజల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్బంధాలకు వ్యతిరేకంగా పోరాటడం ద్వారానే హక్కులను కాపాడుకోగలమని చెప్పారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో విద్య ఉండడం ద్వారానే సామాజిక న్యాయం అమలవుతుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా కోశాధికారి బి.శ్రీరామమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.ఉమాశంకర్, పి.కార్యదర్శి జి.గిరిధరరావు, సూర్యప్రకాషరావు, జి.సురేష్ పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి సాయం



సాయం అందిస్తున్న ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బెండి గ్రామానికి చెందిన అల్లాడ మహాలక్ష్మి కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండటంతో 'కన్నీటి కథ' పేరిట ఇటీవల సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై పలువురు దాతలు స్పందించి బాధితురాలికి అండగా నిలిచారు. శుక్రవారం ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు బాధితరాలికి రూ.8వేలు ఆర్థిక సహాయం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చంటి, నరేష్, రాజేష్, జోగారావు, గోపాల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీ శరణం గచ్ఛామి

వారందరూ తెరవెనుక రాజీకుదిర్చే రక్షక భటులు.. చట్టాలపై అవగాహన కలిగి ఉన్నవారు.. ఏ కేసు వల్ల ఎంత నష్టం చేకూరుతుందో కక్షిదారులకు వివరిస్తారు.. క్షణికావేశంలో భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని హితవుపలుకుతారు.. రాజీకుదుర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేస్తారు. రాజీకి సుముఖత చూపేవారిని తమ పై అధికారుల వద్ద సమావేశపరుస్తారు. వారి సాయంతో కేసుల పరిష్కారానికి కృషిచేస్తారు. జిల్లా కోర్టులలో నిర్వహించే లోక్‌అదాలత్‌లలో వేలాది కేసుల పరిష్కారం వెనుక పోలీస్ అధికారులు, న్యాయవాదులతో పాటు ప్రతీపోలీస్ స్టేషన్ నుంచి కోర్టు వ్యవహారాలు చూసేకానిస్టేబుళ్ల రాజీమంత్రం గట్టిగా పనిచేస్తోంది. కక్షిదారులకు స్వాంతన చేకూర్చుతోంది. ప్రభుత్వ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం సత్ఫలితాలిస్తోంది. ప్రతీ పోలీస్ స్టేషన్ నుంచి కోర్టు వ్యవహారాలు చూస్తున్న కానిస్టేబుళ్ల రాజీప్రయత్నాల ఫలితాలకు 'సాక్షి' అక్షర రూపం.





విజయనగరం డెస్క్:

విజయనగరం ఉమ్మడి జిల్లాలో 53 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ప్రతీ పోలీస్ స్టేషన్ నుంచి కోర్టు పనులు చూసేందుకు ఒక కానిస్టేబుల్/హెడ్‌కానిస్టేబుల్ ఉంటారు. వీరిలో అధికమంది ఉన్నత విద్యావంతులు, చట్టాలపై సంపూర్ణ అవగాహన ఉన్నవారే. పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు కోర్టు పనులు చక్కబెడుతున్నారు. కక్షిదారులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. కోర్టులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగి కాలాన్ని వృథాచేసుకోవద్దని హితవు పలుకుతున్నారు. ఇరువర్గాల వారికి తప్పును ఎత్తిచూపుతున్నారు. అధర్మం వల్ల కలిగే నష్టాలను సున్నితంగా తెలియజేస్తున్నారు. తప్పు ఎక్కడ జరిగిందో ప్రాథమికంగా గుర్తించి పోలీస్ అధికారులకు తెలియజేస్తున్నారు. కౌన్సెలింగ్ ఇప్పించి ఇరువర్గాల మధ్య సయోధ్యకుదర్చడంలో కీలకభూమిక పోషిస్తున్నారు. లోక్‌అదాలత్‌లలో సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ తదితర వేలాది కేసుల పరిష్కారానికి తెరవెనుక సూత్రదారులుగా గట్టి రాజీప్రయత్నాలు చేస్తున్నారు. అందుకే.. ఇటీవల కాలంలో రాజీ కేసుల సంఖ్య అమాంతం పెరిగిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఏడాది కాలంలో లోక్‌అదాలత్‌లో రాజీ అయిన కేసులు ఇలా...

లోక్‌అదాలత్ నిర్వహించిన తేదీ	రాజీ చేసిన కేసుల సంఖ్య
12-03-2022	3,689
26-06-2022	6,514
13-08-2022	6,605
12-11-2022	11,203
11-02-2023	11,661

సహకరిస్తున్న సచివాలయ మహిళా పోలీసులు

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తేవడంతో కోర్టు పనులు మరింత సులభతరమయ్యాయని పోలీస్ అధికారులు చెబుతున్నారు. వివాదాలు పడేవారి పూర్తి సమాచారం సేకరణలో సచివాలయ మహిళా పోలీసులు క్షేత్రస్థాయిలో కీలక పాత్రపోషిస్తున్నారు. వివిధ కేసుల్లో ఇరువర్గాల వారిని సమావేశ పరిచేందుకు, స్టేషన్ నుంచి సమాచారం సకాలంలో ఇచ్చేందుకు సాయపడుతున్నారు. రాజీయత్నాల్లో కూడా వీరు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. నేరగాళ్ల ఉనికిని తెలియజేస్తూ.. నేర నియంత్రణకు సహకరిస్తున్నారు.

రాజీవల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తాం



కేసులు, తగాదాల విషయంలో ఇరువర్గాలు మేలు కోసమే జాతీయ లోక్‌అదాలత్ ఏర్పడింది. అందులో భాగంగానే రాజీకాదగ్గ ప్రతీ కేసును రాజీచేసేందుకు ఎస్‌ఐ సమక్షంలో ఇరువర్గాల్లో అవగాహన కల్పిస్తాం. రాజీవల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తాం. ఫిర్యాదుదారుడు రాజీ అయ్యేందుకు అంగీకారానికి వస్తే ఆ కేసు వివరాలను న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్తాం. కోర్టు నుంచి ఫిర్యాదుదారులు, ముద్దాయిలకు నోటీసులు వెళ్తాయి. వారిని మరోసారి స్టేషన్‌కు పిలిపించి పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ ఇస్తారు. ఫిర్యాదుదారుడి అంగీకారం మేరకు లోక్‌అదాలత్‌లో రాజీకుదురుతుంది. లేదంటే కేసు కొనసాగుతుంది. ఎన్నో ఏళ్లుగా తగాదాలు పడుతూ వ్యయప్రయాసలకు గురైనవారి కేసులను రాజీ చేసినప్పుడు వారిలో కలిగే సంతోషం మాకు తృప్తినిస్తుంది.

– శాంతారావు, కోర్టు కానిస్టేబుల్, చీపురుపల్లి

నష్టాలను వివరిస్తాం



కేసులు, గొడవలు పడడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తాం. నోటీసులు ఇచ్చిన నుంచి వారిని కోర్టులో హాజరుపరిచేవరకు వారి వెంటే ఉంటాం. తప్పు ఎక్కడ జరిగిందో ప్రాథమికంగా గుర్తిస్తాం. ఆ విషయం ఎస్‌ఐ సమక్షంలో ఇరువర్గాలకు సున్నితంగా చెబుతాం. రాజీమార్గం దిశగా ప్రోత్సహిస్తాం. భూ తగాదాలు, ఆస్తి గొడవలు, ప్రోనోట్ కేసులు, భార్యభర్తల గొడవులు వంటివి రాజీ అయినప్పుడు ఇద్దరూ గెలిచినట్టే సంతోషిస్తారు. ఆ సంతోష సమయాన మా కష్టం మర్చిపోతాం. న్యాయమూర్తులు కూడా కొన్నిసార్లు మమ్మలను అభినందిస్తున్నారు.

– జి.వ్యాసు, కోర్టు కానిస్టేబుల్, బుధరాయవలస పోలీస్‌స్టేషన్, మెరకముడిదాం మండలం

సహనంతో ముందుకు సాగుతూ...



నా పేరు ముక్కన రామారావు. గతంలో పార్వతీపురంటౌన్ పోలీస్‌స్టేషన్, ప్రస్తుతం గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. ఎస్‌ఐ సూచనల మేరకు వివిధ కేసుల్లో ముద్దాయిలకు నోటీసులిస్తాం. వారిని కోర్టుల్లో హాజరుపర్చుతాం. ఇరువర్గాలవారితోనూ స్నేహంగా మెలగుతాం. దీనివల్ల వారి కష్టసుఖాలు, సమస్యలు తెలుస్తాయి. తప్పు ఎవరు చేశారో ప్రాథమికంగా నిర్ధారణ అవుతుంది. కేసుల వల్ల వారు పడే ఇబ్బందులు గుర్తిస్తాం. కొన్నిసార్లు ఉద్యోగాలకు వెళ్లే యువకులను కూడా కేసుల్లో ముద్దాయిలుగా చేర్చుతారు. ఆ సమయంలో వారి తల్లిదండ్రులు పడే క్షోభను దగ్గరుండి చూస్తాం. తప్పును ఇరువర్గాలకు తెలియజేస్తాం. రాజీవల్ల కలిగే మేలును వివరిస్తాం. కొందరు పశ్చాత్తాపపడతారు. ఫిర్యాదుదారుకు క్షమాపణ చెబుతారు. కేసును విత్‌డ్రాచేసుకునేందుకు ముందుకు వస్తారు. వారిని ఎస్‌ఐ ముందు సమావేశపరుస్తాం. ఆయన కౌన్సెలింగ్ ఇచ్చాక లోక్‌అదాలత్‌లో న్యాయమూర్తి సమక్షంలో రాజీ కుదురుతుంది. ఆ సమయంలో వారు మా పోలీస్‌లపై చూపే ప్రేమ వెలకట్టలేనిది. కోర్టు పనులు చూసేవారమంతా చట్టాలపై అవగాహనతో పాటు సహనంతో ముందుకు సాగుతాం. గరుగుబిల్లి స్టేషన్ నుంచి ఇటీవల కాలంలో సుమారు 400 కేసులు లోక్ అదాలత్‌లో రాజీ అయ్యాయి. ఉద్యోగంలో ఈ సంతృప్తి చాలు.

400 కేసుల రాజీ



నేను రామభద్రపురం పోలీస్‌స్టేషన్ నుంచి కోర్టు పనులు చూస్తున్నాను. రెండేళ్లలో సుమారు 400 కేసుల వరకు లోక్‌అదాలత్‌లో రాజీ అయ్యాయి. ఇందులో మాతో పాటు పోలీస్ అధికారుల కృషి ఉంటుంది. న్యాయవాదులు తరచూ వినిపించే రాజీయే రాజమార్గం మంత్రాన్ని కక్షిదారులకు బోధిస్తాం. కొందరు తప్పుతెలుసుకుని రాజీకి మొగ్గుచూపుతారు. ఆ క్షణంలో నష్టంజరిగిన వారు ఒక అడుగు వెనుకకు తగ్గినా జీవితాంతం మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఇరు వర్గాల మధ్య రాజీ కుదిర్చేప్రయత్నం ఫలించినప్పుడు మంచిపనిచేశామన్న భావన మాకు సంతృప్తిని కలిగిస్తుంది.

– టి.నాగార్జున, రామభద్రపురం పోలీస్ స్టేషన్

కేజీబీవీలో పాము కలకలం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో శుక్రవారం వేకువజామున పాము కలకలం రేపింది. టెక్కలి మండలం బొప్పాయిపురం గ్రామానికి చెందిన ఏడో తరగతి విద్యార్థిని తెలగవలస షర్మిల నిద్రపోతుండగా కాలుపై నుంచి పాము వెళ్లినట్లు అదే గదిలో ఉన్న మరో విద్యార్థిని పూర్ణిమ చూసింది. విషయాన్ని పాఠశాల ఏఎన్‌ఎం శశికళకు తెలియజేసింది. ఆమె వెంటనే లైట్లు వేసి చూడగా పాము కనిపించలేదు. విషయాన్ని ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరత్నం దృష్టికి తీసువెళ్లి పరిశీలించగా ఎక్కడా పాము కాటు వేసిన గాయాలు కనిపించలేదు. షర్మిల భయపడటంతో తలిదండ్రులకు తెలియజేసి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. కేజీబీవీ సీడీఓఓ ఎస్.నీరజ ఆస్పత్రికి వెళ్లి బాలిక నుంచి వివరాలు సేకరించారు. ఈ ఘటనపై శనివారం మరోసారి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని జీసీడీఓ తెలిపారు.



బాలిక నుంచి వివరాలు తెలుసుకుంటున్న జీసీడీఓ నీరజ

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

జి.సిగడాం: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆనందపురం, ఆబోతులపేట గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి బోర్లు పాడైతే సమాచారం అందిన 24 గంటల్లోగా బాగు చేస్తామన్నారు. ప్రతి పల్లెకు జల్ జీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు చిత్తిరి మోహన్, పేడాడ శ్రీరామమూర్తి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు..



ఆనందపురంలో పనులు పరిశీలిస్తున్న భాగ్యలక్ష్మి

స్కూటీ రంగులు మార్చి..

గొలుసు దొంగతనాలు

- నిందితుడిని పట్టుకున్న పోలీసులు
- 116.2 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం

అల్లిపురం: బండి దొంగిలించి.. దాని రంగులు మార్చి.. గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న ఒకరిని క్రైమ్ పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి 116.2 గ్రాముల బంగారు ఆభరణాలు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. సూర్యాబాగ్‌లోని నగర పోలీస్ కమిషనర్ సమావేశ మందిరంలో క్రైమ్ డీసీపీ గంధం నాగన్న ఈ వివరాలు వెల్లడించారు. గతేడాది అక్టోబర్ 5న దసరా పండగ రోజు సాయంత్రం 7 గంటల సమయంలో మురళీనగర్‌కు చెందిన తెలగపూడి పద్మావతి రామాలయం నుంచి తన ఇంటికి వెళుతున్నారు. ఆ సమయంలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామానికి చెందిన దుక్క జయరామ్ స్కూటీపై వచ్చి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు నల్లపూసల దండను లాక్కొని వెళ్లిపోయాడు. ఈ మేరకు బాధితురాలు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

– ఈ ఏడాది మార్చి 21న మురళీనగర్‌కు చెందిన పొన్నాడ అమ్మాజీ బర్మా క్యాంప్ నూకాలమ్మ గుడి నుంచి మురళీనగర్ నడుచుకుని వెళుతున్నారు. పట్టాభిరెడ్డి తోట ప్రాంతంలో నిందితుడు స్కూటీపై వచ్చి ఆమె మెడలో ఆరు తులాల బంగారు పుస్తెలతాడు, నల్లపూసల దండ లాక్కొని వెళ్లిపోయాడు. ఈ మేరకు బాధితురాలు కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో క్రైమ్ డీసీపీ గంధం నాగన్న ఆదేశాలతో క్రైమ్ ఏడీసీపీ డి.గంగాధరం, క్రైమ్ ఏసీపీ ఎ.వెంకటరావు ఉత్తర్వుల మేరకు వెస్ట్ క్రైమ్ సీఐ కె.దుర్గాప్రసాదరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎన్.సునీల్ సారథ్యంలో రెండు బృందాలు ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని గురువారం కైలాసపురం ప్రాంతంలో అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి దొంగిలించిన సొత్తు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు.



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు నగలు

అప్పుల బాధ తట్టుకోలేక..

నిందితుడు దుక్కా జయరామ్ కుమారుడు అనారోగ్యం, అప్పుల బాధల నుంచి విముక్తి పొందేందుకు చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో బంగారు ఆభరణాలు దొంగతనం చేయాలని నగరానికి వచ్చాడు. కంచరపాలెం పరిధిలో రెండు, గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, ఒక స్కూటీ దొంగతనం చేశాడు. ముందుగా స్కూటీ దొంగతనం చేసి.. చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. తర్వాత స్కూటీ రంగు, నంబర్ ప్లేట్ మార్చి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు క్రైమ్ డీసీపీ నాగన్న తెలిపారు.

సిబ్బందికి క్యాష్ రివార్డులు

నిందితుడిని సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకోవడంతో పాటు సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన సీఐ కె.దుర్గాప్రసాదరావు, కంచరపాలెం, గోపాలపట్నం, పెందుర్తి క్రైమ్ ఎస్‌ఐలు ఎన్.సునీల్, ఎస్.నరసింహరాజు, ఎం.డి.సల్మాన్ ఖాన్, క్రైమ్ కానిస్టేబుళ్లు పి.గణేష్, జీవీవీ కిశోర్, ఎన్.ఎస్.బి.నవీన్‌కుమార్, వై.శివకుమార్, పి.పైడిరాజు, వై.శివ, ఎస్.రవిబాబులకు క్రైమ్ డీసీపీ జి.నాగన్న క్యాష్ రివార్డులు ప్రదానం చేసి అభినందించారు.

బ్యాగుల్లో కుక్కి..

ఖాకీలకు చిక్కి!

- ఒడిశా నుంచి తరలిస్తున్న 30 కిలోల గంజాయి స్వాధీనం
- భార్యాభర్తలు, యువకుడ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు



గంజాయి ప్యాకెట్లను బ్యాగులోంచి తీసి పోలీసులకు చూపిస్తున్న నిందితుడు

శ్రీకాకుళం క్రైమ్: ప్రయాణ బ్యాగుల్లో గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులు శుక్రవారం ఉదయం పోలీసులకు పట్టుబడ్డారు. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం డేఅండ్ నైట్ కూడలి సమీపంలో టాక్సీస్టాండ్ వద్ద ఓ మహిళ, మరో ఇద్దరు వ్యక్తులు మూడు బ్యాగులు పట్టుకుని అనుమానాస్పదంగా కనిపించడంతో ఎస్‌ఐ కె.వెంకటేష, పోలీసు సిబ్బంది వెంటనే అదుపులోకి తీసుకున్నారు. బ్యాగులను తనిఖీ చేయగా 15 గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. వాటిని తూకం వేయగా 30.3 కిలోలుగా నిర్ధారించారు. వెంటనే వీరిని స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. తమది ఒడిశా రాష్ట్రం గుణుపూర్ దగ్గర బురండి గ్రామమని.. విజయవాడ వెళ్లేందుకు గురువారం ఒడిశా నుంచి ఆర్టీసీ బస్సు లోబయల్దేరి రాత్రి అవ్వడంతో శ్రీకాకుళంలో దిగామని.. ఉదయాన్నే విజయవాడ వెళ్లేందుకు నిర్ణయించుకున్నామని చెప్పారు. పట్టుబడిన నిందితుల్లో ముద్దిక రాజు, ముద్దిక లక్ష్మి భార్యాభర్తలు కాగా మరో యువకుడు అజయ్, వీరివెంట చిన్నారులిద్దరున్నారు.

పట్టుకున్నారిలా..

కొంతకాలంగా నగరంలోని యువత గంజా మత్తుతో తూలుతుండటం, ఒడిశా నుంచే అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం నిఘా వర్గాల ద్వారా పోలీసులకు చేరింది. ఈ నేపథ్యంలో ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు అర్ధరాత్రి తనిఖీల్లో ఒడిశా నుంచి వచ్చే వాహనాలు, బస్సులను కాంప్లెక్సు, టాక్సీ కూడళ్లలో పోలీసులు నిఘా పెట్టడమే కాకుండా ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి రెండో పట్టణ ఎస్‌ఐ కె.వెంకటేష్ రాత్రి గస్తీల్లో భాగంగా ఇదే విధంగా తనిఖీలు జరిపారు. వేకువఝాము నుంచే వీరిపై అనుమానం రావడంతో నిఘా పెట్టారు. ఉదయం వీరు ముగ్గురూ విశాఖపట్నం వెళ్లడానికి బ్యాగులతో సన్నద్ధమవుతున్న సమయంలో ఎస్‌ఐతో పాటు హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు ప్రకాష్, విజయ్, మహిళా కానిస్టేబుల్ సంతోషి మాటువేసి పట్టుకున్నారు. గంజాయిని సీజ్ చేసి నిందితులను అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ఇద్దరు వ్యవసాయ సహాయకుల సస్పెన్షన్

- తప్పుడు భూరికార్డులతో ఈ-క్రాప్ నమోదు
- సుమారు రూ.11.16 లక్షలు స్వాహా

టెక్కలి: తప్పుడు భూ రికార్డులతో ఈ-క్రాప్ నమోదు చేసి వాటికి వచ్చిన సుమారు రూ.11.16 లక్షలను కాజేసిన నందిగాం మండలానికి చెందిన ఇద్దరు వ్యవసాయ సహాయకులను సస్పెన్షన్ చేస్తూ వ్యవసాయ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దలవునిపల్లి రైతు భరోసా కేంద్రానికి చెందిన వ్యవసాయ సహాయకుడు పాలవలస నవీన్‌కుమార్ ఇదే మండలం బోరుభద్ర ఆర్‌బీకే వ్యవసాయ సహాయకుడు అనంతగిరి రాంబాబు లాగిన్‌ను ఉపయోగించుకుని తప్పుడు భూ రికార్డులతో వారికి అనుకూలంగా ఉన్న వారి పేర్లతో ఈ-క్రాప్ నమోదు చేశారు. దీనికి సంబంధించి కామధేనువు, కృష్ణరాయపురం గ్రామాల్లో భూములు ఉన్నట్లు నమోదు చేశారు. వీటికి సంబంధించి సుమారు రూ.11.16 లక్షల ఇన్సూరెన్స్ విడుదల కావడంతో ఆ సొమ్మును కాజేశారు.

2021 సంవత్సరానికి సంబంధించి ఇన్సూరెన్స్ జాబితాలో ఇదే ఆర్‌బీకేల పరిధిలో కొంతమంది రైతుల పేర్లు లేకపోవడంతో వ్యవసాయాధికారులు విచారణ చేయగా అసలు విషయం బయటపడిందని టెక్కలి వ్యవసాయ శాఖా ఏడీ బీ.వీ.తిరుమలరావు వెల్లడించారు. వ్యవసాయ సహాయకులు పాలవలస నవీన్‌కుమార్, అనంతగిరి రాంబాబు ఇద్దరూ కలిసి ఈ-క్రాప్ నమోదులో అక్రమాలకు పాల్పడి ఇన్సూరెన్స్ డబ్బులను కాజేసినట్లు బహిర్గతం కావడంతో ఇరువురిని జేడీ సస్పెన్షన్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



కంబైన్డ్ హార్వెస్టర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని బైరి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం కార్తికేయ క్లస్టర్ స్థాయి కంబైన్డ్ హార్వెస్టర్‌ను (వైఎస్సార్ యంత్రసేవ)ను జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు యంత్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రుప్ప దివ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిట్టి జనార్దనరావు, ఏడీఏ రజనీ, వ్యవసాయ అధికారి ఉషాకుమారి, డీసీసీబీ మేనేజర్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ

శ్రీకాకుళం నానుబాలవీధిలో విజయదుర్గా అమ్మవారిని శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

- శ్రీకాకుళం కల్చరల్

